www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం

శనివారం

22 మార్చి 2025

## విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రెజకీయాలు, సామాజిక అంశలపై అవగాహన ఉండి.. రెయగల వెరికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003








# అట్టుడికిన ఉభయసభలు

## బడ్జెట్‌పై ప్రశోత్తరాలపై వాడీవేడి చర్చ

- ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ సభ్యుల విమర్శనాస్త్రాలు
- బడ్జెట్ కుదింపు, బిల్లుల మంజూరు కమీషన్లపై నిలదీసిన బీజేపీఎల్పీ నేత
- ప్లకార్డులతో మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీల నిరసన
- ప్రోటోకాల్ పాటించేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ సీఎం రేవంత్ కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వినతి

**కలంజ్యోతి, హైదరాబాద్ :**
ఏడో రోజు అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా ముగిశాయి. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కాగానే స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై విపక్ష సభ్యుడు హరీశ్ రావు అసంతృప్తి వ్యక్తం చేశారు. బడ్జెట్, హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల అమ్మకాలపై చర్చ సందర్భంగా హరీశ్ రావు, ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మధ్య డైలాగ్ వార్ నడిచింది. సీఎం రేవంత్ రెడ్డిపై మండలిలోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీతక్క గట్టి కౌంటర్ ఇచ్చారు. దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ పరువు తీసిందే కవిత అని చురకలంటించారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి రాష్ట్ర అప్పులపై సభ వేదికగా ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన బడ్జెట్ కుదింపు, గుత్తేదార్లకు బిల్లుల మంజూరు విషయంలో వసూలు చేస్తున్న కమీషన్లపై గళమెత్తారు. వీటితో పాటు పలు ఆసక్తికర సన్నివేశాలు చోటు చేసుకున్నాయి. రోడ్లు లేక తమ జిల్లాలో అబ్బాయిలకు పెళ్లికి పిల్లనివ్వడం లేదంటూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి. బడ్జెట్

మిగతా 2లో



2లో

## భారీగా కుళ్లిన మేక, గొర్రె మాంసం స్వాధీనం



- కాంగ్రెస్ వాళ్లు రైజింగ్ అంటున్నారు.. అది వాళ్ల కేబినెట్‌లోనే కనిపిస్తుంది..
- 15 నెలల్లో రూ.లక్షా 63 వేల కోట్ల అప్పులు చేశారు

2లో

## తెలంగాణ నమూనా ఏంటో అర్థం కావడం లేదు

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

2 కలంజ్యోతి
శనివారం 22.03.2025 General News

# అట్టుడికిన ఉభయసభలు

మొదటిపేజీ తరువాయి

కేటాయింపులు ఇతర సమస్యలపై సభలో అధికార, ప్రతిపక్షాలు తలపడగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి నియోజకవర్గాల్లో ప్రోటోకాల్ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

## ప్రొటోకాల్ పాటించట్లేదు

### ముఖ్యమంత్రి రేవంత్ కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు

అసెంబ్లీ, లోక్ సభ నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ప్రోటోకాల్ అమలు చేయాలంటూ ప్రభుత్వం తరపున అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని విన్నవించారు. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్ లో రేవంత్ రెడ్డితో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్ రావు, మల్లారెడ్డి, పద్మారావు గౌడ్ భేటీ అయ్యారు. ఈ అంశంపై దాదాపు 15 నిమిషాల పాటు చర్చించారు.

## మండలిలో బీఆర్ఎస్ నిరసన

తెలంగాణ బడ్జెట్ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వినూత్న నిరసనలు కొనసాగుతున్నాయి. రోజుకో అంశంపై నిరసన వ్యక్తం చేస్తున్న గులాబీ పార్టీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై శుక్రవారం శాసనమండలి ఆవరణంలో ఎమ్మెల్సీ కవితతో పాటు నిరసన తెలియజేశారు. 'అప్పులు ఘనం.. అభివృద్ధి శూన్యం' అంటూ ప్లకార్డులు పట్టుకుని 'అప్పులు ఆకాశంలో అభివృద్ధి పాతాళంలో' అంటూ నినాదాలు చేశారు. గడిచిన ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష 58 వేల కోట్ల అప్పు చేసి ఎంతమంది మహిళలకు రూ.2,500 ఇచ్చారు? ఎంతమంది వృద్ధులకు రూ. 4వేల పెన్షన్ ఇచ్చారు? ఎంత మందికి తులం బంగారం ఇచ్చారని నిలదీశారు.




# తెలంగాణ నమూనా ఏంటో అర్థం కావడం లేదు

## బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



**కలంజ్యోతి, హైదరాబాద్ :** అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్.. ఇచ్చిన హామీలను పాతరేసేలా ఉందని బీజేపీ శాసన సభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. తెలంగాణ వస్తే బతుకులు మారుతాయని అనుకున్నారు.. కానీ, రాష్ట్రం అప్పుల కుప్పగా మారింది.. పదేళ్లలో లక్షల కోట్లు అప్పు చేసింది గత ప్రభుత్వం.. గొప్పలకు పోయి గత ప్రభుత్వం నిధులు వృథా చేసింది అని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 మాసాలైన గత ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై విచారణ జరపడం లేదు అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలు వాస్తవం కాదా.. వాస్తవం అయితే ఎందుకు కేసులు పెట్టడం లేదు అని ప్రశ్నించారు. దోచుకున్న సొత్తును రీకవరి చేసి ఆరు గ్యారంటీలకు ఖర్చు చేయాలి అని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటిలకు కేటాయించిన నిధులు సరిపోవు.. ప్రభుత్వ పథకాలకు మంగళం పాడుతున్నారు.. పారదర్శకత, జవాబుదారీతనం అంటే అప్పుల వివరాలను బయట పెట్టకపోవడమేనా? అని ఏలేటీ మహేశ్వర్ రెడ్డి అడిగారు.


ఇక, ప్రభుత్వ భూములు, లిక్కర్ అమ్మకం ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచాలని చూస్తున్నారని తెలంగాణ బీజేపీ శాసన సభా పక్షనేత మహేశ్వర్ రెడ్డి తెలిపారు. రెవెన్యూ వ్యయం, మూల ధన వ్యయం సమానంగా ఉంది.. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది.. కాబట్టి తాము అదే దారిలో పోతాం అన్నట్లు ప్రస్తుత ప్రభుత్వ తీరు ఉంది.. సుపరిపాలన, సంక్షేమ ప్రభుత్వం కాదు కమీషన్ల ప్రభుత్వం అని ఆరోపించారు. తెలంగాణ నమూనా అంటే కమిషన్లు, కూల్చివేతలు, హామీల ఎగవేతనా?.. మేనిఫెస్టోలో లేని ఫోర్త్ సిటీని ఏర్పాటు చేస్తానని చెప్పి ఇచ్చిన హామీలను విస్మరిస్తుంది.. ఫోర్త్ సిటీ పేరుతో లంకె బిందెల కోసం పాకులాడుతుంది.. రాష్ట్ర ప్రభుత్వం రైజింగ్ అంటుంది కానీ పేద ప్రజల్లో రైజింగ్ కనబడటం లేదు.. నలుగురు మంత్రుల మధ్యే రైజింగ్ ఉంది.. ప్రభుత్వం నిమిషానికి కోటి రూపాయల అప్పు చేస్తోంది.. జీఎస్టీ పెంచి చూపించడం 71 వేల కోట్లు అప్పు తీసుకురావడానికి చూపిస్తున్నట్లు ఉంది.. ఆరు గ్యారంటీలకు చట్ట భద్దత కల్పిస్తామన్న ముఖ్యమంత్రి మాట తప్పారు.. ఆరు గ్యారంటీలకు నిధులు కేటాయించకపోవడం ప్రజలను మోసం చేసినట్లు కాదా? అని బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి అన్నారు.

అలాగే, కౌలు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది అని ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టించే ఆలోచన ఉందా.. ప్రజలను మోసం చేస్తారా?.. కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని మోసం చేశారు.. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పి ఇప్పుడు రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారు.. ఆరోగ్య శ్రీ పథకం కింద ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేర్చుకోవడం లేదు.. పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. రైతు డిక్లరేషన్ పై రాహుల్ గాంధీ మాట తప్పడం గా భావిస్తాం.. భూ భారతి మార్గదర్శకాలు ఎప్పటి వరకు పూర్తి చేస్తారో చెప్పాలని అడిగారు. ధరణి అవకతవకలను ఎప్పుడు బయట పెడుతారు.. 25 వేల ఎకరాలు చేతులు మారాయని చెప్పారు.. 2.5లక్షల అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై ఎందుకు చెప్పడం లేదు.. అన్యాంక్రాంతం అయిన భూములపై సీట్ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. విద్యాశాఖకు 15 శాతం నిధులు ఎందుకు కేటాయించలేదు.. ఫీజు రెగ్యులేటరీ కమిటి వేసి ఫీజులు నియంత్రుస్తామని చెప్పారు.. ఎందుకు ఫీజు రెగ్యులేటరీ కమిటి నియమించలేదు.. గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలే.. 15 నెలలుగా విద్యా శాఖకు మంత్రి లేకపోవడం బాధాకరం అని కమలం పార్టీ శాసన సభ్యులు మహేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

# భారీగా కుళ్లిన మేక, గొర్రె మాంసం స్వాధీనం

- హైదరాబాద్ నగరంలోని డబీర్‌పురలో మాతాకీ కిడ్కి ప్రాంతంలో అధికారుల దాడులు
- 2 క్వింటాళ్ల పాడైన మేక, గొర్రె మాంసం స్వాధీనం
- ఫ్రిడ్జ్‌లో నిల్వ చేసి వాటిని వివిధ వివాహాలు, హోటల్‌స్‌కి సరఫరా
- మహమ్మద్ మిస్బాహుద్దీన్ (24) అరెస్ట్

**కలంజ్యోతి, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని డబీర్‌పురలో మాతాకీ కిడ్కి ప్రాంతంలో కమిషనర్ టాస్క్ ఫోర్స్, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో, పాడైన మేక, గొర్రె మాంసాన్ని ఫ్రిడ్జ్ లో నిల్వ చేసి వాటిని వివిధ వివాహాలు, హోటల్స్ కి సరఫరా చేస్తున్న మహమ్మద్ మిస్బాహుద్దీన్ అనే 24 ఏళ్ల వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు మహమ్మద్ మిస్బాహుద్దీన్ తన వద్ద 2 క్వింటాళ్ల పాడైన మేక, గొర్రె మాంసాన్ని ఫ్రిజ్‌లలో నిల్వ చేసి వాటిని తక్కువ ధరకు వివాహాలు, హోటల్స్‌కి విక్రయిస్తున్నాడు. పోలీసులు అతని వద్ద నుంచి పాడైన మాంసం సీజ్ చేసి ఈ అక్రమ కార్యకలాపాలను అడ్డుకున్నారు. ఈ దాడి జీహెచ్ఎంసీ అధికారుల ఆధ్వర్యంలో, కమిషనర్ టాస్క్ ఫోర్స్ అధికారులతో సహా విస్తృతంగా నిర్వహించారు. గత రెండు రోజుల క్రితం కూడా గోషామహల్ ప్రాంతంలో కూడా పాడైన మాంసం అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తున్న విషయం గుర్తించి భారీగా పాడైన మాంసం సీజ్ చేయడం జరిగింది. అయితే, ఈ దందా ఓల్డ్ సిటీలో ఎక్కువగా సాగుతోందని అధికారులు గుర్తించారు. పాడైన ఈ మాంసం అతి తక్కువ ధరలో విక్రయించడంతో కొనడానికి ప్రజలు తెగ ఉత్సాహం చూపుతున్నారు. అయితే వీటిని తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తప్పకుండా ఎదురుకోవాల్సిందే.



## రోడ్డు ప్రమాదాల నివారణ

# అందరి బాధ్యత

### జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్



**కలంజ్యోతి, జగిత్యాల :** రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాలని, ప్రమాదాలు జరిగినప్పుడు విధిగా సహకారం అందించి ప్రాణాలు కాపాడాలని జగిత్యాల జిల్లా ఎస్పి అశోక్ కుమార్ అన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించే ఉద్దేశంతో 'సురక్షిత ప్రయాణం' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ఇందులో భాగంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను (బ్లాక్ స్పాట్స్) ను నెషనల్ హైవే అథారిటీ అధికారులు మరియు పోలీసు అధికారులతో కలిసి ఎస్పీ సందర్శించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుందనీ ప్రమాదాలను పూర్తిగా నివారించాలంటే ప్రజల సహకారం అవసరమని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడిపి, ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అధిక రోడ్డు ప్రమాదాలు జరిగే 43 (బ్లాక్ స్పాట్స్) ప్రాంతాలను గుర్తించి వివిద శాఖల సమన్వయంతో ప్రమాదాలు జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకోవడంతో పాటు పోలీస్ కళా బృందం ద్వారా జాతీయ రహదారి పై ఉన్న అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, హైవేలపై జరిగే యాక్సిడెంట్ లకు సంబంధించి ఫస్ట్ రెస్పాండర్స్ గా ఉండేందుకు హైవేలపై ఉన్న పెట్రోల్ బంక్ వారికి, ధాబాలో పనిచేసే వారికి, యూత్ ,విలేజెస్, కి ఫస్ట్ ఎయిడ్ మరియు సిపిఆర్ పై అవగాహన కలిగించడం జరిగిందని, ద్విచక్ర వాహనదారులకు రోడ్డు ప్రమాదాలను వివరించడానికి హెల్మెట్ అవగాహన ర్యాలీని నిర్వహించడంతోపాటు హెల్మెట్లు పంపిణీ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో ఎక్కువగా ప్రధాన రహదారికి కలిసే రోడ్డుల వద్ద అధిక ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున జాతీయ రహదారులకు ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలకు, గ్రామీణ ప్రాంతాలలో రోడ్డు ప్రమాదాల నివారణ



చర్యల గురించి ఎక్కువగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎస్పి ప్రమాదాలు ఎక్కువగా జరుగు ప్రదేశాలను పరిశీలించి, రోడ్డు భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, మార్పుల పై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎస్పీ వెంట డీఎస్పీ రఘు చంధర్, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ రఫిక్ ఖాన్, సీఐలు వేణుగోపాల్, కృష్ణారెడ్డి, రవి, ఎస్ఐ లు సదకర్, నరేష్ మల్లేషం, ఎన్ హెచ్ ఏఈ లక్ష్మణ్, ఏఎంవీఐ ప్రమీల పాల్గొన్నారు.



## ఉద్యోగ భద్రత కల్పించాలి

**కలంజ్యోతి భీమదేవరపల్లి :** ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఆశా కార్యకర్తలు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, స్థిరమైన కనీస వేతనం రూ. 26 వేలు, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రాథమిక వైద్య కేంద్రం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో గౌర్రె పుతులి, స్వరూప, శోభ, వసంత, భాగ్యలక్ష్మి, సునీత, రమ, పారిజాత, అరుణ, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి

# ఆర్థిక సాయం

**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని ముత్యంపేట బ్లాక్ ఏరియాకు చెందిన మాల్వే లక్ష్మి మూడు రోజుల క్రితం మృతిచెందింది. కాగా.. ఆమె కుమారుడు మాల్వే రాజుకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుక్రవారం రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ దారం ఆదిరెడ్డి, మ్యాక లక్ష్మణ్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, బాలే శ్రీనివాస్, కొండబత్తిని అనిల్ కుమార్, తాళ్ల హరినాథ్, కందరి ముత్యం రెడ్డి, కనుకుంట రాజయ్య, మల్యాల దేవయ్య, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.






## ప్రభుత్వ భూములను

# పరిశీలించిన కలెక్టర్

**కలంజ్యోతి, జగిత్యాల :** జిల్లాలోని కోరుట్ల పట్టణంలో ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 13 04 5 ఎకరాల ల్యాండ్ 928 సర్వేనెంబర్ లో 30 ఎకరాలు ప్రభుత్వ భూమినీ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణ పరిధిలోని 1304 సర్వేనెంబర్ లో గల 5 ఎకరాల భూమి మరియు 920 సర్వే నెంబర్లు 30 ఎకరాల ప్రభుత్వ భూమిని , 923 సర్వే నెంబర్లు గల 30 ఎకరాల భూమి పరిశీలించారు.కలెక్టర్ వెంట కోరుట్ల ఆర్డిఓ దివాకర్ రెడ్డి ఎంపీడీవో మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ నాయక్ తాసిల్దార్ సర్వేలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి పరామర్శ

**కలంజ్యోతి, గీసుగొండ :** మండలంలోని మచ్చాపూర్ ఏలేఏం ప్రైవేట్ స్కూల్లో పీటీ టీచర్ గా నాగిశెట్టి సతీష్ బాబు విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతిచెందారు. కాగా.. శుక్రవారం ఏలేఏం స్కూల్ కరస్పెండెంట్, డాక్టర్ విశ్వనాథ్, ప్రిన్సిపాల్ రవికాంత్, స్కూల్ సిబ్బంది సతీష్ బాబు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే సీనియర్ ఎంసీపీఐ వరంగల్ జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, జన్ను శ్రీనివాస్, రవి, ఆంధ్ర రాయలసీమ జిల్లాల నుండి తెలంగాణ జిల్లాల నుంచి ఉమెన్ రైట్స్ చైర్మన్ అశోక్, దళిత సంఘాల నాయకుడు జన్ను రవిబాబు, గ్రామస్తులు, రాజకీయ నాయకులు అధికారులు, తోటి టీచర్లు సతీష్ బాబు కుటుంబానికి ప్రగాఢ సంతాపం సానుభూతి తెలిపారు.

## నేడు విద్యుత్ వినియోగదారుల

# పరిష్కార వేదిక



**కలంజ్యోతి, జగిత్యాల :** జగిత్యాల సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక శనివారం ఏర్పాటు చేస్తున్నట్లు ఏడీఈ జవహర్ లాల్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల పట్టణంలోని సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలో ఉ.10 గంటల నుండి మ.1 గంటల వరకు జగిత్యాల టౌన్ 1, 2, 3 చల్ గల్ ,పొలాస సెక్షన్ పరిధిలో గల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఈ వేదికలో హాజరై పరిష్కరించుకోగలరని ఆయన పేర్కొన్నారు.



## పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

**కలంజ్యోతి, జగిత్యాల :** జిల్లాలో ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలను జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. శుక్రవారం జగిత్యాల పట్టణంలోని ఓల్డ్ హై స్కూల్, పురానణి పేట ప్రభుత్వ హై స్కూల్, కోరుట్ల పట్టణంలోని ఎస్ఎఫ్ఎస్ ప్రైవేట్ హై స్కూల్లో జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రలనులను పరిశీలించారు. జిల్లాలో మొత్తం 11,855 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని వీరి కోసం 67 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతత వాతావరణంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరుగుతున్నాయని చెప్పారు. విద్యార్థులు 11,838 మంది విద్యార్థులకు 11826 మంది పరీక్ష కు హజరైనట్లు 26 మంది గైహాజరైనట్లు పేర్కొన్నారు. సప్లమెంట్ రాస్తున్న 31 మంది విద్యార్థులకు 25 హాజరైనట్టు తెలిపారు. కలెక్టర్ వెంట జగిత్యాల ఆర్డిఓ మధుసూదన్, జిల్లా విద్యా శాఖ అధికారి రాము, ఎమ్మార్వో రామ్మోహన్ తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## పదో తరగతి పరీక్షలు ప్రశాంతం

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** మండలంలోని ముల్కనూరులో పదో తరగతి పబ్లిక్ పరీక్ష తెలుగు ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. మొదటి రోజు 352 రెగ్యులర్ విద్యార్థులు 100 శాతం హాజరయ్యారు. ముల్కనూర్ జెడ్ పీహెచ్ఎస్ హైస్కూల్ 152 మంది, తెలంగాణ మోడల్ స్కూల్ 200 మంది విద్యార్థులు హాజరైనట్లు సూపరింటెండెంట్ రవిప్రకాష్ రావు, వేణుగోపాలరావు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు దాసరి రవీందర్, కొమురయ్య తెలిపారు.




## మొదటి రోజు ప్రశాంతగా పది పరీక్షలు

**కలంజ్యోతి, మల్యాల :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో(బాలుర ) ఎస్ఎస్ సీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రం వద్దకు చేరిన విద్యార్థులు హల్ టికెట్ నంబర్ చూసుకున్న తరువాత ప్రత్యేక అధికారులు విద్యార్థుల వద్ద ఎలాంటి స్మార్ట్ వాచులు, మైబైల్స్, లేకుండా తనిఖీలు చేస్తూ లోనికి అనుమతించారు. పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలలోని మొత్తం విద్యార్థులు సంఖ్య 564 మందికి, రామన్నపేట హైస్కూల్ పరీక్ష సెంటర్ లో ఒకరు గై హాజరయ్యారని మండల విద్యాధికారి జయసింహరావు తెలిపారు.

# పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు

### మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



**కలంజ్యోతి, మంచిర్యాల :** జిల్లాలో 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయని, పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని ఆర్.బి. హెచ్.వి., జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, తహశిల్దార్ రఫతుల్లా లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. త్రాగునీరు, విద్యుత్ సరఫరా, ఆర్.టి.సి. బస్సులు, ప్రశ్నా, జవాబు పత్రాల రవాణా, బందోబస్తు, పారిశుద్ధ్యం అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. అత్యవసర వైద్య సేవల నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరిగిందని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు, జిల్లాలో పరీక్షల నిర్వహణ కొరకు 49 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షల మొదటి రోజు 9 వేల 183 మంది హాజరు కావలసి ఉండగా 9 వేల 163 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారని, ఒకసారి అనుత్తీర్ణులైన వారు 6 మంది హాజరు కావలసి ఉండగా ఇద్దరు హాజరయ్యారని, 99.74 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని తెలిపారు.

**విధులలో నిర్లక్ష్యం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు**

మొదటి రోజున జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష 2 గంటల ఆలస్యంగా ప్రారంభమైందని తెలిపారు. రోజు వారిగా, ప్రశ్నాపత్రాల సెట్ల వారిగా పోలీస్ స్టేషన్ నుండి ప్రశ్నాపత్రాలను బందోబస్తు మధ్య ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని పరీక్షా కేంద్రాలకు తరలించడం జరుగుతుందని, ఆఖరి నిమిషం వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకునే ప్రశ్నాపత్రాల వివరాలు ఎవరికి తెలియదని తెలిపారు. మంచిర్యాల పోలీస్ స్టేషన్ నుండి స్టేషన్ పరిధిలోని పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు తరలించవలసి ఉంటుందని, ఈ క్రమంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రం03015 కు తరలించే ట్రంక్ బాక్సులో రెండవ రోజు పరీక్ష సంబంధించిన ప్రశ్నాపత్రాలు ఉన్నాయని గమనించి, పరీక్షా కేంద్రానికి రావలసిన ప్రశ్నాపత్రాల బాక్స్ ను వెతకడంలో 1.30 గంటల సమయం పట్టిందని, ఉన్నతాధికారుల అనుమతి పొంది, పరీక్షా కేంద్రానికి తరలించారు. విద్యార్థులకు ప్రశ్నాపత్రాలను అందించడంలో మొత్తం 2 గంటల ఆలస్యం జరిగిందని, విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిబంధనల ప్రకారం 3 గంటల సమయం ఇవ్వడం జరిగిందని, 2 గంటల ఆలస్యంగా పరీక్ష ప్రారంభమైనందున విద్యార్థులకు స్నాక్స్ అందించడం జరిగిందని తెలిపారు. ట్రంక్ బాక్స్ లో గుర్తించి రెండవ రోజు పరీక్ష ప్రశ్నాపత్రాలను తెరువలేదని, రాష్ట్ర ప్రభుత్వ సీల్ తో పోలీస్టేషన్లో అలాగే భద్రపర్చబడి ఉందని తెలిపారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని, ఒక ప్రశ్నాపత్రానికి బదులు మరొక ప్రశ్నాపత్రం ఇచ్చారని, పేపర్ లీక్ అయిందంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తెలిపారు. విధులలో నిర్లక్ష్యం, అలసత్వం వహించిన పరీక్షా కేంద్రం ముఖ్య పర్యవేక్షకులు మీర్ సఫ్టర్ అలీఖాన్, శాఖ అధికారి ఎన్.ఆర్. పద్మజను సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీరేంద్ర, యోగేశ్వర్‌కు అభినందన

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** మండల కేంద్రంలోని హాస్టల్ సంక్షేమ అధికారిగా ఎన్నికైన అన్న బీరేంద్రని, నర్సింగ్ ఆఫీసర్ గా జోరు యోగేశ్వర్ ఇటీవల ఎన్నికవ్వగా తోటి మిత్రులు శ్రేయోభిలాషులు అభినందించారు.
చెన్నారావు పేట మండల కేంద్రానికి చెందిన అన్న బీరేంద్ర ఇటీవల ప్రకటించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 333వ ర్యాంక్ జోన్ స్థాయిలో 41వ ర్యాంక్ సాధించి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తోటి మిత్రులు వారిని శాలువా తో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిప్రసాద్, విజయ్, రమేష్, సంతోష్, తోటి మిత్రులు కెంచ ప్రవీణ్, పులిశేరు రాజేందర్, పల్లకొండ తిరుపతి, కెంచ అనిల్, వైనాల రాజు, గాదగోని రాజు, ఎడ్ల రాజేందర్, రొడ్డ కుమారస్వామి, గొట్టే రాజు, వీరస్వామి, రాజశేఖర్, నల్లాల రాజు పాల్గొన్నారు.



కలంజ్యోతి 5
శనివారం 22.03.2025 General News

# ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలి

## మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్



**కలం జ్యోతి, మంచిర్యాల :** ఎల్ఆర్ఎస్ 2020 పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత గల వారు రుసుము చెల్లింపు ప్రక్రియ వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దానకిశోర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాష్ జ్యోతి, జోనల్ కమీషనర్ అపూర్వ లతో కలిసి జిల్లాల కలెక్టర్లు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ జిల్లాలో అనుమతి లేని లేఅవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియపై ప్రజలకు తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. లేఅవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తులలో అర్హులైన దరఖాస్తుదారులు ఈ నెల 31వ తేదీ నాటికి పూర్తి ఫీజు చెల్లించినట్లయితే 25 శాతం ఫీజు తగ్గించేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ విషయంపై ఫీజు చెల్లించేందుకు దరఖాస్తుదారులకు వివిధ ప్రసార, ప్రచార మాధ్యమాల ద్వారా సమాచారం అందించి ఫీజు చెల్లించే విధంగా విస్తృత ప్రచారం చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్2020 పథకంలో అర్హులైన ప్రతి లబ్దిదారుడు రుసుము చెల్లించేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఎఫ్.టి.ఎల్. / నిషేధిత భూములకు సంబంధించి ఎల్ 2 లాగిన్లో ఆప్షన్ ఇవ్వడం జరిగిందని, నూతన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, రుసుము చెల్లించిన వారికి పట్టాల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. మున్సిపల్ కమీషనర్లు, పట్టణ ప్రణాళిక అధికారులు, మండల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్మాణాలు అధికంగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎల్.ఆర్.ఎస్. 2020 పథకంలో అర్హులైన అభ్యర్థుల నుండి రుసుము చెల్లించే విధంగా జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. దరఖాస్తు సమయంలో దరఖాస్తుదారుల మొబైల్ నంబర్, చిరునామా వివరాలు తీసుకోవడం జరిగిందని, వారికి ఫోన్ కాల్ చేసి రుసుము చెల్లింపు వివరాలు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఎఫ్ టీఎల్, నిషేధిత భూములకు సంబంధించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యాశాఖకు 15శాతం బడ్జెట్ కేటాయించని చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మేడ్చల్ జిల్లా బాచుపల్లి శాఖ చైతన్య కాలేజీలో పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ నాగేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్నటువంటి అసెంబ్లీ సమావేశాల్లో విద్యాశాఖకు రాష్ట్ర ప్రభుత్వం 23,108 కోట్లు అంటే 7 శాతం ఇవ్వడం సిగ్గుచేటు. ఇతర రాష్ట్రాల్లో చూసుకున్నట్లయితే 12 13 శాతం బడ్జెట్ విద్యాశాఖకు ఇస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే మన రాష్ట్ర ప్రభుత్వానికి విద్యాశాఖ పై ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తుంది. ఈరోజు రాష్ట్రంలో పాఠశాలల నుంచి యూనివర్సిటీ వరకు విద్యార్థులు ఎన్నో సమస్యలకు గురవుతున్నారు. విద్యాశాఖ గురించి పట్టించుకునే విద్యశాఖ మంత్రిని కూడా నియమించలేకపోతున్నారు. ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంకా సర్టిఫికెట్లు రాక ఉద్యోగాలకు వెళ్లలేకపోతున్నారు.రాష్ట్రంలో దాదాపు 8 వేలకు ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ పెండింగ్ ఉంది. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా నిద్ర మేల్కొని విద్యాశాఖ మంత్రిని నియమించి పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ వెంటనే విడుదల చేసి,విద్యాశాఖకు సంబంధించినటువంటి బడ్జెట్ ను 7% నుండి 15% కు పెంచాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుంది లేని పక్షాన అసెంబ్లీని ముట్టడిస్తాం. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వైష్ణవి తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవ వేడుకలు

**కలంజ్యోతి, భీమదేరపల్లి :** ప్రపంచ అటవీ దినోత్సవం మార్చి 21ని పురస్కరించుకొని శుక్రవారం కొత్తపెల్లి జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ అటవీ దినోత్సవం వేడుకలను జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు అతియా సుల్తానా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ జిల్లా అటవీ శాఖ అధికారి కాజీపేట పురుషోత్తం హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అడవుల ఆవశ్యకత, సంరక్షణ గురించి తెలిపారు. అటవీ ఉత్పత్తుల వల్ల లాభాలు అనే అంశంపై పిపిటి ప్రదర్శన చేశారు. వక్తలు టి. శ్రావణ్ కుమార్, రవిబాబు మాట్లాడుతూ, సమీపంలో ఉన్న ఇనుపరాతి గట్ల అటవీ ప్రాంతాన్ని కాపాడుకొనే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అడవుల నిర్మూలన జరుగుతే భూతాపం పెరుగుతుందని, తద్వారా మానవుని మనుగడ ప్రశ్నార్థకమవుతుందని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51(జి) ప్రాథమిక విధిని అనుసరించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ రెడ్డి, పిడి రాజేశ్వరి, రమేష్, రవిబాబు, రాజేశ్వరి, లక్ష్మి, పద్మ, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

*- మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి*



**కలంజ్యోతి, చెన్నారావుపేట :** నర్సంపేట నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట నియోజకవర్గ నాయకులు, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కార్పొరేషన్ల ద్వారా రూ.6వేల కోట్లతో ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకాన్ని తీసుకురావడం హర్షనీయమన్నారు.. ఈ పథకం ద్వారా దాదాపు ఒక్కొక్కరికి రూ.5 లక్షల వరకు స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందన్నారు. ఇందుకు గానూ మార్చి 15 నుంచి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియో గించుకోవాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు, ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పిస్తూ బిల్లు, యువతకు స్వయం ఉపాధి కల్పించే రాజీవ్ యువ వికాసం పథకం అమలుచేసిన ప్రజా ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.




## సఖి సెంటర్ ద్వారా మహిళలకు భరోసా

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** మండలంలోని వీఓ కమ్యూనిటీ హాల్ లో మహిళా శిశు సంక్షేమశాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'సఖి అవగాహన కార్యక్రమం' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సఖి ముఖ్య ఉద్దేశాలు, అందించే సేవలను సఖి సెంటర్ లీగల్ అడ్వైజర్ శ్రీదేవి, కేస్ వర్కర్ అనూష వివరించారు. ఉద్దేశాలను, సఖి అందించే ఐదు రకాల సేవలు కౌన్సిలింగ్, వైద్యం, పోలీస్, న్యాయ సహాయం తా త్కాలిక వసతి సహాయం ఇలా ఐదు రకాల సేవలను గురించి తెలుపుతూ గృహహింస లైంగిక వేధింపులు పనిచేసేచోట వేధింపులు లైంగిక దాడులు.. ఇలాంటివి రక్షణ పొందడానికి సఖి సెంటర్ 24 గంటలు పనిచేస్తుందని సమస్య ఉన్నప్పుడు 181 మహిళా హెల్ప్ లైన్ కు కాల్ చేయడం ద్వారా తక్షణ సాయం లభిస్తుందని తెలిపారు. 0870 2452112, 7382983088కు కాల్ చేయడం ద్వారా బాధిత మహి ళలకు సాయం అందించనున్నట్లు వివరించారు. ఈ సదస్సును వివోస్ ఎస్ హెచ్ జీ గ్రూప్ మెంబర్స్ లీడర్స్, వర్కింగ్ ఉమెన్స్ పాల్గొన్నారు.




# సీఎం సహాయనిధి చెక్కు అందజేత

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** అనారోగ్యానికి కారణంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుని.. సీఎం సహాయ నిధికి ఆశ్రయించిన బాధితులకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి గ్రామ అధ్యక్షుడు కంచ ప్రభాకర్ చేతిలో మీదుగా బాధితులకు శుక్రవారం అందజేశారు. గ్రామానికి చెందిన పెరమండ్ల ఎల్లగౌడ్ రూ. 36000 మంజూరైనట్లు మెంకట్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో నిరుపేదలకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, మైనార్టీ సంఘం మండల అధ్యక్షుడు అమీర్, ఉప్పరి కొమురయ్య, మాజీ వార్డు మెంబర్ కన్నం వెంకన్న, తాళ్ల సమ్మయ్య, అబ్బదాసి సధాకర్, మొర్రి వీరస్వామి, కంచ అశోక్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## వట్టే శ్రీనివాస్ రెడ్డి

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** నర్సంపేట నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెన్నారావుపేట మండల యువ నాయకుడు వట్టే శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ల కార్పొరేషన్ల ద్వారా రూ.6వేల కోట్లతో ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకాన్ని తీసుకురావడం హర్షనీయమన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని యువత ఆర్థికంగా బలపడాలని సూచించారు. ఇందుకుగాను మార్చి 15 నుంచి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని యువత వినియోగించుకోవాలన్నారు.



# వధూవరులకు రాణా ఆశీర్వాదం

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** మండల కేంద్రానికి చెందిన గోల్కొండ పద్మ క్రీ:శే శ్రీనివాస్ కుమార్తె స్పందన వేణు వివాహానికి బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వనపర్తి మల్లయ్య, నియోజకవర్గ నాయకులు మనీష్ గౌడ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు, మండల అధ్యక్షులు కొనుకటి నవీన్, కాటి హరీష్, సాంబరాజు, కోరే రాకేష్, భక్కతట్ల రవీందర్, పడిదం హరికృష్ణ, బానోత్ నరేష్, లవుడ్య రాజు, సంతోష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా కొనసాగుతున్న పరీక్షలు

## పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన నిర్మల్ కలెక్టర్ అభిలాష



**కలంజ్యోతి, నిర్మల్ :** పదో తరగతి పరీక్షలు నిర్మల్ జిల్లాలో తొలిరోజు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు చేరుకుని తమ సీటింగ్ వివరాల కోసం చూడడం కనిపించింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 47 పరీక్షా కేంద్రాల్లో 9122 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 9115 మంది హాజరయ్యారు. ఎస్పీ జానకి షర్మిల ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని రవి హైస్కూల్, సోన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలోని పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీ.సీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా? నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా అన్న అంశాన్ని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఏఎన్ఎం, సిబ్బంది, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్ కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావ్, అధికారులు పరమేశ్వర్, తహసీల్దార్ లు మల్లేష్, రాజు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# ప్రశాంత వాతావరణంలో పది పరీక్షలు

## పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరి



**కలంజ్యోతి, అందోలు :** సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు మొదటిరోజు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు జిల్లా కేంద్రంలోని రిషి పబ్లిక్ స్కూల్లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పదవ తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ పరీక్షలు వచ్చేనెల 2వ తేదీ వరకు జరగనున్నాయి. జిల్లాలో 122 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 22 వేల 423 మంది విద్యార్థులు హాజరుకాగా 40 మంది విద్యార్థులు హాజరు కాలేకపోయారని ఆమె తెలిపారు. తనిఖీ సందర్భంగా కలెక్టర్ పరీక్షా కేంద్రంలో నిర్వహణ విద్యార్థులకు కల్పించిన సదుపాయాలు పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి అక్రమాల అవకతవకలకు తావు లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాలలో నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడిలకు లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు మరోసారి కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.







# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

## జగిత్యాల డీఎస్పీ రఘుచందర్



**కలంజ్యోతి, జగిత్యాల :** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, నేరాలను కట్టడి చేయొచ్చని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. ప్రతి ప్రార్థన మందిరాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం బుగ్గారం మండలంలోని యశ్వంతరావుపేట గ్రామంలో గల మజీద్ లో ఏర్పాటుచేసిన 10 సీసీ కెమెరాలను ముస్లిం కమిటీ పెద్దలతో కలిసి డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం ద్వారానే నేర రహిత సమాజ నిర్మాణం సాధ్యమన్నారు. నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు కాపాడేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపు చేయొచ్చని తెలిపారు. దొంగతనాలు నివారించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు తదితర ఘటనలు జరిగిన పరిస్థితుల్లో సీసీ కెమెరాల ద్వారా వారిని గుర్తించి పట్టుకోవడానికి పోలీసులకు మూడో నేత్రంగా ఉపయోగపడుతుందన్నారు. బుగ్గారం మండలంలోని ప్రజలు తమ వ్యక్తిగత భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు లో ముందుకు వచ్చి పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంలో కృషిచేసిన ముస్లిం కమిటీ సభ్యులను డీఎస్పీ అభినందించారు. అనంతరం మసీద్ కమిటీ సభ్యులచే ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి సీఐ రాం నరసింహారెడ్డి, ఎస్ఐ శ్రీధర్ రెడ్డి, మసీద్ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణలో అకాల వర్షాలు..


## అప్రమత్తమైన ప్రభుత్వం



**కలంజ్యోతి, హైదరాబాద్ :** ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లో శనివారం కూడా ఈదురు గాలులు, వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వెంటనే సంబంధిత జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు.

**సీఎస్ వీడియో కాన్ఫరెన్స్..**

ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలలో నేడు కురిసిన వడగళ్ల వాన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లతో శుక్రవారం సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితులను సమీక్షించారు. వడగళ్ల వాన వలన నెలకొన్న పరిస్థితులను ఆమె అడిగి తెలుసుకున్నారు. జిల్లా యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన సహాయక చర్యలు అందించాలన్నారు. రానున్న 48 గంటలలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని సూచన ఉన్నందున



అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడూ పరిస్థితులను సమీక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. అకాల వర్షాల వలన ఏర్పడే నష్టాల అంచనాలను ఎప్పటికప్పుడూ ప్రభుత్వానికి నివేదికలు అందించాలని ఆదేశించారు.



# సమంతకు ఉత్తమ నటి అవార్డు

సమంత తెలుగులోనే కాదు, హిందీ, తమిళం వంటి ఇతర భాషల్లోనూ ప్రతిభావంతమైన నటిగా గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల కాలంలో ఆమె తెలుగులో నటించిన సినిమాలు ఏవీలేవు. అయినప్పటికీ వెబ్ సిరీస్ ల ద్వారా అభిమానులను అలరిస్తూనే ఉన్నది. అమ్మడి క్రేజ్ ఇప్పటికీ తగ్గలేదంటే అతిశయోక్తి కాదు. తాజాగా సమంతకు ఓటీటీలో ఉత్తమ నటి అవార్డు లభించింది. 'హనీబన్నీ' సిరీస్‌లో అద్భుతమైన నటన కనబరిచినందుకు ఒక ప్రముఖ మీడియా సంస్థ ఆమెను ఈ పురస్కారంతో సత్కరించింది. ఈ అవార్డును అందుకోవడం పట్ల సమంత తన సంతోషాన్ని వ్యక్తం చేసింది. ప్రతికూల పరిస్థితుల నడుమ 'హనీబన్నీ' సిరీస్ ను పూర్తి చేయడమే తనకు ఒక అవార్డు అని సమంత పేర్కొంది. తనను నమ్మిన వారందరికీ ఈ అవార్డును అంకితం చేస్తున్నట్లు ఆమె తెలిపింది. రాజ్ అండ్ డీకే, వరుణ్ ధావన్ ల వల్లే తాను 'సిటాడెల్ హనీబన్నీ'ని పూర్తి చేయగలిగానని సమంత చెప్పింది. సిరీస్ ను పూర్తి చేయడానికి వారు ఎంతో ఓపికతో వ్యవహరించారని, తనను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారని ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

